# సాక్షి మెదక్

ఆదివారం । 21 । మే । 2023






## కోలుకునే..ఇప్పుడిప్పుడే

నాలుగు నెలలుగా నష్టాల్లో కూరుకుపోయిన పౌల్ట్రీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ప్రస్తుతం పెరిగిన ధర ఎంత కాలం కొనసాగుతుందో చూడాలి.

8లో



## రెండు హార్వెస్టర్లు దగ్ధం

వరికోత సమయంలో హార్వెస్టర్ ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. మరోచోట విద్యుత్ తీగలు తగిలి ఓ హార్వెస్టర్ కాలిపోయింది.

8లో

## దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు అత్యుత్తమమైన జూనియర్ కళాశాలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి తెలిపారు. పదో తరగతిలో 7.0 జీపీఏ, ఆపై గ్రేడ్ పొందిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 22 నుంచి జూన్ 3వ తేదీలోగా telanganaepass.egg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## న్యూస్‌రీల్

### భాగ్యరెడ్డివర్మ జయంతిని విజయవంతం చేయాలి

మెదక్ కలెక్టరేట్: దళిత వైతాళికుడు, సంఘ సంస్కర్త భాగ్యరెడ్డివర్మ జయంతిని ఈనెల 22వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ రాజర్షిషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాలు, జిల్లా అధికారులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### లారీల సమస్యను పరిష్కరిస్తాం



సిబ్బందితో మాట్లాడుతున్న మహ్మద్ ఖాసీం

చిలప్‌చెడ్(నర్సాపూర్): ధాన్యం కొనుగోలు విషయంలో లారీల సమస్య తీవ్రంగా ఉందని ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని జిల్లా ముఖ్య ప్రణాళిక మహ్మద్ ఖాసీం అన్నారు. శనివారం మండల పరిధిలోని శీలాంపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా లారీల సమస్యతో పాటు గన్నీ బ్యాగుల కొరత ఉందని రైతులు వివరించారు. అనంతరం ఖాసీం మాట్లాడుతూ.. ఉన్నతాధికారులతో చర్చించి గన్నీ బ్యాగులు తెప్పిస్తామన్నారు. అదేవిధంగా లారీల సమస్యను పరిష్కస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శశిప్రభ, మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి, ఏపీఎం ప్రేమలత, ఏపీఓ శ్యాంకుమార్, మండల గణాంక అధికారి వెంకటేశ్, సీసీ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

### 'అమృత్ సరోవర్' పనులు వేగవంతం చేయాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ శ్రీనివాస్

చిన్నశంకరంపేట(మెదక్): చెరువుల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అమృత్ సరోవర్ పనులు వేగవంతం చేయాలని డీఆర్‌డీఏ శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం మండలంలోని చందాపూర్, జంగరాయి గ్రామాల్లో చెరువుల వద్ద కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా పనులు జరుగుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. చెరువులో మట్టిని తొలగించడం, చెరువు కట్టలను బలోపేతం చేయడమే లక్ష్యంగా అమృత్ సరోవర్ పథకం ద్వారా పనులు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మండలంలో ఐదు గ్రామాల్లో అమృత్ సరోవర్ పథకం ద్వారా పనులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఆయన వెంట ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తదితరులు ఉన్నారు.

### కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఏఓ ఆశాకుమారి

మెదక్ రూరల్: జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చేసే సమయంలో చెత్త, పొల్లు లేకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఆశాకుమారి సిబ్బందికి సూచించారు. శనివారం మండల పరిధిలోని మాచవరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎంత కొనుగోలు జరిగింది? ఇంకా ఎంత ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉంది? ఎంత కొనుగోలు చేసే అవకాశం ఉందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గోనె సంచులు, హమాలీల వివరాలపై ఆరా తీశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమకు తెలియజేయాలని రైతులకు సూచించారు. ధాన్యం త్వరగా రైస్ మిల్లులకు చేరేలా అవసమైన ఏర్పాట్లు చేశామని..తేమశాతం 17 కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్, మాచవరం సెంటర్ ఇన్‌చార్జి నరేశ్, రైతులు పాల్గొన్నారు.

# టార్గెట్ రీచ్ కావాల్సిందే!

### లేకుంటే డ్యూటీలు బంద్

- తలలు పట్టుకుంటున్న కండక్టర్లు, టిమ్ డ్రైవర్లు



మెదక్ ఆర్టీసీ డిపో

మెదక్‌జోన్: ఇచ్చిన టార్గెట్ కన్నా తక్కువ వచ్చిందని ఇటీవల ఓ లేడీ కండక్టర్‌కు డిపో అధికారులు మూడు రోజులుగా డ్యూటీలు ఇవ్వలేదు. దీంతో చేసేది లేక ఆ కండక్టర్ ఉన్నతాధికారి వద్దకు వెళ్లి కాళ్లవేళ్ల పడి డ్యూటీలో చేరింది. అలాగే గత నెలలో ఎక్స్‌ప్రెస్ బస్సులో విధులు నిర్వర్తించిన మరో కండక్టర్‌కు రూ. 16 వేల టార్గెట్ విధించారు. కానీ ఆరోజున ప్రభుత్వ సెలవు దినం కావడంతో కలెక్షన్ రూ. 12,700 వచ్చింది. దీంతో సంగారెడ్డి ఆర్‌ఎం ఆఫీస్‌కు వెళ్లాలని ఓ లెటర్‌ను సదరు కండక్టర్ చేతిలో పెట్టారు డిపో అధికారులు. చేసేది లేక అతడు ఉన్నతాధికారి వద్దకు వెళ్లి తన బాధ చెప్పుకున్నాడు. ఇలా గత కొన్ని నెలలుగా టార్గెట్ తేలేదంటూ వేధింపులు ఎక్కువవుతున్నాయని కండక్టర్లు, టిమ్ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో మెదక్, నర్సాపూర్ డిపోలు ఉన్నాయి. మెదక్‌లో 102 బస్సులు ఉండగా వాటిలో 66 ప్రైవేట్ (అద్దె) బస్సులు కాగా మిగితా 36 ఆర్టీసీకి సంబంధించినవి.
- అలాగే నర్సాపూర్ డిపోలో 30 బస్సులకు గానూ ఐదు అద్దె బస్సులు కాగా 25 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి.
- వీటిలో డ్రైవర్లు, కండక్టర్లు మొత్తం కలిపి ఐదు వందల పైచిలుకు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.
- కాగా కొన్నినెలల క్రితం మెదక్ డిపోను ఓ ఉన్నతాధికారిణి దత్తత తీసుకుని కండక్టర్లు, టిమ్ డ్రైవర్లకు టార్గెట్లు విధిస్తూ హుకుం జారీ చేశారు.
- ఆర్డినరీ బస్సును రోజుకు 360 కిలోమీటర్లు తిప్పి రూ.16 వేల పైచిలుకు టార్గెట్ తేవాలి. అలాగే ఎక్స్‌ప్రెస్ రోజుకు 420 కిలోమీటర్లు తిప్పి రూ. 22 వేలపై చిలుకు టార్గెట్ తీసుకురావాలని ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేశారు.
- టార్గెట్ రీచ్ కాకుంటే ఆ మరుసటి రోజు వారికి డ్యూటీ ఇవ్వడం లేదు. ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి లిఖిత పూర్వకంగా ఆదేశాలు తెస్తేనే విధుల్లోకి తీసుకుని బస్సు అప్పగిస్తున్నారు.
- ఒక వేళ ఇచ్చిన టార్గెట్ తెస్తే ఆ మరుసటి రోజు మరో రూ. 2 వేలు ఎక్కువ తీసుకురావాలని టార్గెట్ విధిస్తున్నారని కండక్టర్లు, టిమ్ డ్రైవర్లు చెబుతున్నారు.
- తెచ్చిన టార్గెట్‌లో నుంచి సెస్, టోల్‌గేట్ రుసుం అంటూ రూ. 3 వేలు తీసి మిగిలిన డబ్బును లెక్కిస్తున్నారని వాపోతున్నారు.

**వీఆర్‌ఎస్ తీసుకోండి!**

- టార్గెట్ తెస్తేనే విధులు నిర్వర్తించండి లేకుంటే వీఆర్‌ఎస్ తీసుకుని వెళ్లిపోవాలని కండక్టర్లకు ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.
- లేకుంటే మరో డిపోకు బదిలీ చేస్తామంటూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని సిబ్బంది పేర్కొంటున్నారు.
- టిమ్ డ్యూటీలు ఇస్తూ టార్గెట్ తేలేదని వేధించటం.. రోజుకు 10 గంటల డ్యూటీ చేయిస్తూ ఇబ్బందులు పెడుతున్నారని వాపోతున్నారు.
- సెలవు రోజుల్లో ఉద్యోగులు, ప్రజలు బస్సులు ఎక్కకపోవడంతో టార్గెట్ రావడం లేదు. అలాగే ఎండల తీవ్రతకు ప్రయాణాలు చేయడం లేదు.
- దీంతో టార్గెట్ చేరుకోలేక పోతున్నామని ఆర్టీసీ కార్మికులకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అవగాహన కల్పిస్తున్నాం**

టార్గెట్ తీసుకురావాలని కండక్టర్లు, టిమ్ డ్రైవర్లకు చెబుతున్న మాట వాస్తవమే. టార్గెట్ రీచ్ కాకుంటే కండక్టర్లకు అవగాహన కల్పించి మళ్లీ విధుల్లోకి తీసుకుంటున్నాం.

– రవీందర్, డీఎం మెదక్

# తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే..

### కలెక్టర్ రాజర్షిషా



కరపత్రం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, అధికారులు

మెదక్ కలెక్టరేట్: తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదేనని.. వారిని నిరాదరణకు గురిచేయడం అన్యాయమని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ బాధ్యతలు చూసుకోని పిల్లలపై ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌పోర్టల్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈసందర్భంగా జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి బ్రహ్మాజీతో కలిసి వెబ్‌పోర్టల్‌ను లాంఛనంగా ప్రారంభించి కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లల నిరాదరణకు గురైన వృద్ధులు వెబ్‌పోర్టల్ tsseniorcitizens.cgg.gov.inలో ఫిర్యాదు చేయాలని సూచించారు. కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుల నమోదులో ఇబ్బందులుంటే 14567 హెల్ప్‌లైన్‌లో సంప్రదించాలని వివరించారు.

**ఆదివారం ధాన్యం కొనుగోలు చేపట్టాలి**

రైతులకు ఇబ్బంది కలగకుండా ఆదివారం కూడా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. శనివారం మండల ప్రత్యేక అధికారులు, ఆర్డీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు తమకు కేటాయించిన కేంద్రాల్లో ఆదివారం సైతం ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా విధులు నిర్వర్తించాలన్నారు. ధాన్యం తూకం వేసిన వెంటనే లారీల ద్వారా మిల్లులకు తరలించి 24 గంటల్లోగా దించుకునేలా పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా ఎఫ్‌సీఐకి పెండింగ్ ఉన్న సీఎంఆర్ ఈ నెలాఖరు వరకు తరలించేలా చూడాలని ఆదేశించారు.

# అట్టహాసంగా ముగిసిన వార్షిక క్రీడలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని అవసులపల్లి వద్ద జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వార్షిక క్రీడలు శనివారం అట్టహాసంగా ముగిశాయి. లాంగ్ జంప్‌లో తూప్రాన్ సబ్ డివిజన్ జట్టు మొదటి స్థానం.. మెదక్ సబ్ డివిజన్ జట్టు రెండో స్థానం కైవసం చేసుకున్నాయి. వాలీబాల్‌లో ఏఆర్ జట్టు విజయం సాధించి మొదటి స్థానాన్ని, మెదక్ సబ్ డివిజన్ జట్టు రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. క్రికెట్‌లో ఏఆర్ జట్టు మొదటి స్థానం, మెదక్ సబ్ డివిజన్ జట్టు రెండో స్థానంలో నిలిచాయి. బాడ్మింటన్‌లో డబుల్ మొదటి బహుమతి నాగరాజు (కానిస్టేబుల్), అంజనేయులు, డబుల్ రెండో బహుమతి దినకర్, కృష్ణ, సింగిల్స్ మొదటి విజేత మెదక్ రూరల్ సీఐ విజయ్, సింగిల్స్ రెండో విజేతగా నరేశ్ ఆర్‌ఎస్‌ఐ నిలిచారు. 100 మీటర్ల పరుగు పందెం మొదటి బహుమతి సాయికుమార్ ఏఆర్పీసీ, రెండవ బహుమతి ప్రభాకర్, 200 మీటర్ల పరుగు పందెం మొదటి బహుమతి సాయి కుమార్, రెండో బహుమతి శ్రీధర్‌గౌడ్ క్లూస్ టీం, 400 మీటర్ల పరుగు పందెం మొదటి బహుమతి మహిపాల్ ఆర్‌ఎస్‌ఐ, రెండో బహుమతి కృష్ణ ఏఆర్పీసీ, లాంగ్‌జంప్ మొదటి బహుమతి సాయి కుమార్, రెండో బహుమతి అంజయ్య, షార్ట్‌పుట్ సాయికుమార్, రెండో బహుమతి ప్రకాశ్ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీలు సైదులు, యాదగిరి, ఏఆర్డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐలు, సీఐలు, ఎస్ఐలు, పీఈటీ మధు జిల్లా పోలీస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# 1,05,901 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం

### అదనపు కలెక్టర్ రమేశ్



తూప్రాన్‌లో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

తూప్రాన్: జిల్లాలో 407 కొనుగోలు కేంద్రాల ద్వారా 25,319 మంది రైతుల నుంచి 1,05,901 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటివరకు రూ. 77.21 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని అదనపు కలెక్టర్ రమేశ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హమాలీలను అధిక సంఖ్యలో పెట్టుకొని ధాన్యం వచ్చిన 24 గంటల్లోగా దించుకొని ట్రక్ షీట్ అందజేయాలని రైస్ మిల్లర్లకు సూచించారు. అకాల వర్షాలతో ధాన్యం సేకరణలో కాస్త ఇబ్బందులు ఎదురైనా ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా ప్రతి రోజు ధాన్యం సేకరణ ప్రక్రియపై మానిటరింగ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. గోనె సంచులు, లారీల సమస్యలు ఉత్పన్నం కాకుండా పర్యవేక్షిస్తున్నామని వివరించారు. తూకంలో ఎలాంటి తేడాలు గమనించిన కంట్రోల్ రూం 08452-223360 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్ఞానజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

**తరుగుపై ఫిర్యాదులు..**

రామాయంపేట(మెదక్): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరుగు తీస్తున్న విషయమై చాలా ఫిర్యాదులు వస్తున్నాయని.. ఈవిషయమై చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ రమేశ్ పేర్కొన్నారు. నార్సింగి మండల కేంద్రంలో శనివారం పలు రైస్ మిల్లులను జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరుగు విషయమై తూనికలు, కొలతల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. వారి వెంట నార్సింగి తహసీల్దార్ సత్యనారాయణ ఉన్నారు.

# అందుబాటులో కొనుగోలు కేంద్రాలు

### నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దశంకరంపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలు కేంద్రం, బుజ్రాన్‌పల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధ సంజీవరెడ్డి, సర్పంచ్‌లు కుంట్ల రాములు, నరేశ్, బూదెమ్మ, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, ఎంపీటీసీలు వీణ సుభాశ్‌గౌడ్, స్వప్న రాజేశ్, నాయకులు మాణిక్‌రెడ్డి, రవీందర్, అంజయ్య, శంకర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, పున్నయ్య, విజయ్, పీఏసీఎస్ సీఈఓ రవీందర్, ఏపీఎం గోపాల్, ఏఈఓ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# చాకరిమెట్లలో భక్తుల సందడి



వ్రతమాచరిస్తున్న భక్తులు



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దంపతులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.

# మనోహరాబాద్ బీపీఎం సస్పెండ్

మనోహరాబాద్(తూప్రాన్): విధుల్లో నిర్లక్ష్యం వహించిన మనోహరాబాద్ బీపీఎంను సస్పెండ్ చేసినట్టు మెదక్ ఎస్పీఎం శ్రీహరి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో బీపీఎంగా పనిచేస్తున్న విశ్వాస్ రెడ్డి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నాడని స్థానికులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌తో విచారణ చేయించగా నిజమని తేలిందన్నారు. దీంతో విశ్వాస్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్టు పేర్కొన్నారు.

# 'ఆరోగ్య మహిళ'కు ఆదరణ

- కేంద్రాలకు తరలివస్తున్న మహిళలు
- జిల్లాలో ఇప్పటివరకు 486 మందికి పరీక్షలు
- త్వరలోనే మరో ఎనిమిది కేంద్రాలు



అల్లాదుర్గం మహిళా ఆరోగ్య కేంద్రంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): గ్రామీణ ప్రాంత మహిళలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కొత్తగా మహిళా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రతి మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తుంది. ఇందులో మహిళలకు 8 రకాల ఆరోగ్య సమస్యలను తీర్చేందుకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. చికిత్స సైతం అందిస్తున్నారు. దీంతో ఈకేంద్రాలకు విశేష స్పందన వస్తోంది.

- రాష్ట్ర ప్రభుత్వం మార్చి 8వ తేదీన మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది.
- జిల్లాలో ప్రస్తుతం ఆరు మహిళా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో అల్లాదుర్గం, చిన్నశంకరంపేట, టేక్మాల్, వెల్దుర్తి, శివ్వంపేట, మనోహరాబాద్ మండలాల్లో ప్రారంభించారు.
- మరో ఎనిమిది కేంద్రాలను త్వరలోనే ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.
- ఆరోగ్య కేంద్రాల్లో మహిళా డాక్టర్లు సిబ్బంది ఎనిమిది రకాల ఆరోగ్య సమస్యలకు చికిత్స అందిస్తున్నారు.
- ఈ కేంద్రాల్లో ఇప్పటివరకు 486 మంది మహిళలకు పరీక్షలు చేసి జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు.
- ప్రతి మంగళవారం కేవలం మహిళలకే వైద్యం అందిస్తుడడంతో మెరుగైన వైద్యం పొందుతున్నారు. దీంతో ఈ కేంద్రాలకు మంచి స్పందన వస్తోంది.

**బాగా చూస్తున్నారు**

మహిళా డాక్టర్లు మంచిగా చూస్తున్నారు. ఆరోగ్య మహిళ కార్డు ఇచ్చి ప్రతి మంగళవారం రావాలని చెబుతున్నారు. తమ సమస్యలను ఇబ్బంది లేకుండా డాక్టర్లకు చెప్పడంతో చూసి మందులు ఇస్తున్నారు.



– గోండ్ల లక్ష్మి, అల్లాదుర్గం

**గదులు లేక ఇబ్బంది**

ఆరోగ్య కేంద్రంలో సరిపడా గదులు లేక ఇబ్బంది పడుతున్నాం. నిలబడడానికి కూడా స్థలం సరిపోవడం లేదు. మెరుగైన వైద్యం అందుతున్నా సౌకర్యాలు కల్పించడం లేదు. ఇప్పటికైనా సరిపడా గదులు నిర్మించాలి.



– అనిత, అల్లాదుర్గం

**స్పందన బాగుంది**

మహిళలకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. డాక్టర్లతో పాటు సిబ్బంది కూడా మహిళలే ఉండడంతో వైద్య సదుపాయం త్వరగా అందుతుంది. త్వరలో సీఎం చేతుల మీదుగా మరో ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. ఈ కేంద్రాల్లో ల్యాబ్ సౌకర్యంతో పాటు రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నాం. కేన్సర్‌ను గుర్తించి మెరుగైన వైద్యం అందిస్తున్నాం.



– చందునాయక్, జిల్లా వైద్యాధికారి

## క్లుప్తంగా

### ఎర్తింగ్ వైరుకు తగిలి..



మృతిచెందిన ఎద్దు వద్ద రైతు

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందిన సంఘటన మండలంలోని మొండి తండాలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మోగ్యానాయక్ ఎద్దు రోజులాగే మేత మేయడానికి వెళ్లి ఎర్తింగ్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.

### బాలుడి మృతిపై పోలీసుల విచారణ

**మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ఇటిక్యాలలో తోపులాటలో బాలుడి మృతిచెందిన ఘటనపై శనివారం పోలీసులు విచారణ ప్రారంభించారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ కృష్ణమూర్తి గ్రామానికి చేరుకుని బాలుడి మృతిపై విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యబృందం ఆధ్వర్యంలో బాలుడి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు.

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందాడు. హద్నూర్ ఎస్‌ఐ వినయ్ కుమార్ కథనం ప్రకారం మండల పరిధిలోని గుంజోటి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ శనివారం ఇంట్లో విద్యుత్ మోటారు ప్లగ్ పెట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్ తగిలింది. స్పృహ కోల్పోయిన విజయ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం సమీపంలో గల బీదర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు విజయ్‌కుమార్ మృతి చెందినట్టు తెలిపారు.

# కోలుకునే.. ఇప్పుడిప్పుడే

- ధర పెరగడంతో పౌల్ట్రీ రైతులకు ఊరట
- లైవ్ బర్డ్ కిలో రూ.105

గజ్వేల్: నాలుగు నెలలుగా నష్టాల్లో కూరుకుపోయిన పౌల్ట్రీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ప్రస్తుతం పెరిగిన ధర ఎంత కాలం కొనసాగుతుందో చూడాలి. ఉమ్మడి మెదక్ జిల్లాలో వ్యవసాయ రంగం తర్వాత రెండో అతిపెద్దదిగా పౌల్ట్రీ వెలుగొందుతోంది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోనే అత్యధికంగా ఉత్పత్తులను అందిస్తున్న జిల్లాగా ఈ ప్రాంతం ఖ్యాతి గడించింది. పౌల్ట్రీపై ప్రతి నెలా ఇక్కడ రూ.1000 కోట్ల మేర లావాదేవీలు సాగుతుంటాయని అంచనా.

- వేలాది మంది రైతులు సుగుణ, వెంకటేశ్వర, డైమండ్, జాహ్నవి, జానకి, ఎస్ఆర్, స్నేహ తదితర ఇంటిగ్రేటెడ్ సంస్థల భాగస్వామ్యంతో పౌల్ట్రీలు నడుపుతున్నారు.
- ఆ సంస్థల నుంచి చిక్స్, వాటికి 45రోజుల వ్యవధి కోసం మందులు, దాణా అందుతుంది. ఒక్కో బర్డ్ సగటున రెండు కిలోలకు పైగా తూకం వస్తుంది. ఈ స్థాయికి వచ్చేవరకు సంస్థలు రెండు కిలోల కోడిపై రూ. 180కిపైగా ఉత్పత్తి వ్యయం కింద ఖర్చుచేస్తున్నాయి.
- మార్కెట్‌లో చికెన్ ధరతో సంబంధం లేకుండా రైతులకు ఒక్కో కోడిపై కిలోకు రూ. 5–6 చెల్లిస్తాయి. నిర్వహణ బాగుంటే మరో 50పైసలు అదనంగా చెల్లిస్తారు.
- ఇంటిగ్రేటెడ్ సంస్థల ఒప్పందం ప్రకారం ఉత్పాదక వ్యయం భారీగా పెరిగితే మాత్రం రైతులు నష్టాలు భరించాల్సి ఉంటుంది.
- 5శాతం కోళ్లకంటే ఎక్కువగా మృత్యువాత పడితే నష్టాలను రైతులే భరించాలి. విద్యుత్‌చార్జీల రూపేణా 5వేల కోడిపిల్లల సామర్థ్యం కలిగిన షెడ్‌కు 45రోజులకు రూ.5వేలపైనే బిల్లు చెల్లించాల్సి ఉంటుంది.
- వీటన్నింటినీ మినహాయిస్తే ఈ సంస్థల భాగస్వామ్యంతో కోళ్లను పెంచుతున్న రైతులకు మిగులుతున్నది అంతంతమాత్రమే.



గజ్వేల్‌లోని ఓ పౌల్ట్రీ ఫామ్

### కొన్నేళ్లుగా ప్రతికూల పరిస్థితులు

- కొన్నేళ్లుగా పౌల్ట్రీ పరిశ్రమను ప్రతికూల పరిస్థితులు చుట్టుముడుతున్నాయి. సొంత పరిశ్రమలో ఒక్కో కోడి ఉత్పత్తి చేయడానికి అన్నీ కలుపుకొని రూ.180కిపైగా వరకు ఖర్చవుతున్నది.
- రెండు కిలోలపైగా బరువుండే లైవ్ బర్డ్స్ చికెన్ ధర రూ. 210కి పైగా పలికితే నష్టాలు ఉండవు. కానీ ధరలో నిలకడ లేక పౌల్ట్రీ రైతులు ఆందోళనలో ఉన్నారు.
- నాలుగు నెలలుగా లైవ్ బర్డ్ ధర కిలోకు కేవలం రూ.55–85 మాత్రమే పలికింది. పది రోజులుగా ప్రస్తుతం కంపెనీలు రైతుల వద్ద లైవ్ బర్డ్‌ను కిలోకు రూ.105కిపైగా ధర చెల్లిస్తున్నారు. దీనివల్ల ఇప్పుడిప్పుడే పరిశ్రమ కోలుకుంటోంది.
- ఈ ధర నిలకడగా ఉంటుందా...? అనేది వేచి చూడాల్సి ఉన్నది. మరోవైపు దాణా ధరలు ఏటా పెరుగుతుండటం కూడా రైతులను కుంగదీస్తున్నది.
- గతేడాది కిలోకు రూ.37 పలికిన దాణా ధర ప్రస్తుతానికి రూ. 43కు పెరగటం వల్ల రైతులకు భారంగా మారుతోంది.

**ధరల్లో నిలకడ లేకే ఇబ్బందులు**

నేను 25ఏళ్లుగా పౌల్ట్రీ రంగంలోకి ఉన్నాను. నష్టాలు ఎదురైనా తట్టుకున్న. మార్కెట్‌లో చికెన్ ధర పెరుగుతున్నా..ఉత్పత్తి చేసే వాడికి, కొనేవాడికి పెద్దగా లాభం జరగటం లేదు. అమ్మేవాడికి, కొనేవాడికి మధ్యలో ఉన్నవాళ్లకే లాభం జరుగుతున్నది. మేం లైవ్ బర్డ్‌ను ప్రస్తుతం రూ.105కి అమ్ముతున్నాం. అయినా మిగులుతున్నది అంతంతే. నాలుగు నెలలుగా కిలో ధర అతి తక్కువగా కిలోకు కేవలం రూ.55–85మాత్రమే పలికింది. ప్రస్తుతం రూ.105కు పెరిగింది. ఇది ధర కొనసాగుతుందా...లేదా...? అనేది కూడా డౌటే.

పౌల్ట్రీఫామ్ నిర్వాహకుడు, శౌరీపూర్, దౌల్తాబాద్ మండలం

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. కమిషనరేట్ పరిధిలో శనివారం పలు సైబర్ నేరాలు జరిగినట్లు ఆమె తెలిపారు.

**న్యూడ్ వీడియోలు పంపి...**

గౌరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి వాట్సాప్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తి నుంచి న్యూడ్ వీడియోలు పంపించాడు. అనంతరం ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బ్లాక్ మెయిల్ చేశాడు. భయపడిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తికి ఆన్‌లైన్ ద్వారా మూడు విడతల్లో రూ.61,450 డబ్బులు పంపించి మోసపోయాడు. ఘటనపై బాధితుడు జాతీయ హెల్ప్ లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు.

**డేటింగ్ కోసం వెతికి...**

చిన్నకోడూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి డేటింగ్ ఇన్ఫర్మేషన్ కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశాడు. ఆన్‌లైన్ వచ్చిన నంబర్‌కు ఫోన్ చేయగా గుర్తు తెలియని వ్యక్తి సూచించిన విధంగా ఆన్‌లైన్‌లో రూ.17,200 పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

**డేటా ఎంట్రీ జాబ్ పేరిట మోసం**

మిరుదొడ్డి పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఆన్‌లైన్ డేటా ఎంట్రీ జాబ్ ఉందని, బ్యాంకు వివరాలు పంపాలని కోరాడు. నమ్మిన బాధితుడు బ్యాంక్ వివరాలతో పాటు తన సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీని చెప్పాడు. దీంతో బాధితుడి ఖాతా నుంచి రూ.9,000 డెబిట్ అయినట్లు గుర్తించి, జాతీయ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశాడు.

## క్రిప్టో కరెన్సీ అకౌంట్ పేరిట...



పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో పడి ఓ బీడీఎల్ నాలుగులక్షలకు పైగా మోసపోయాడు. భానూర్–బీడీఎల్ ఎస్‌ఐ సాయిలు కథనం ప్రకారం.. మండల పరిధిలోని భానుర్– బీడీఎల్ టౌన్‌షిప్‌నకు చెందిన బీడీఎల్ ఉద్యోగి హరిప్రసాద్‌కు ఈనెల 10వ తేదీన వాట్సాప్ ద్వారా ఓ వీడియోస్ లైక్ చేసే జాబ్ ఉందంటూ ఓ లింక్ వచ్చింది. దీంతో బాధితుడు లింక్ క్లిక్ చేసి తన వివరాలు నమోదు చేశాడు. అనంతరం వారు బాధితుడిని టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేశారు. వచ్చిన వీడియోస్ లింక్స్ చేయమని చెప్పగా, బాధితుడు క్లిక్ చేయగా అతని ఖాతాలో రూ.4 వేలు జమ చేశారు. అనంతరం బాధితుడికి క్రిప్టో కరెన్సీ అకౌంట్ క్రియేట్ చేసుకోమని చెప్పి లింకు పంపారు. అనంతరం ఆ లింకు ద్వారా బాధితుడు వివరాలు నమోదు చేసి అకౌంట్ క్రియేట్ చేసుకున్నాడు. పెట్టిన నగదుకు 30 శాతం కమీషన్ ఇస్తామని నమ్మించారు. దీంతో అప్పటి నుంచి బాధితుడు పలు దఫాలుగా రూ.4,21,000 జమ చేశాడు. తాను పెట్టిన నగదుతో పాటు 30శాతం కమీషన్ ఇవ్వాలని బాధితుడు అడగడంతో వారు స్పందించలేరు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులతోపాటు భానూర్ బీడీఎల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# మద్యం మత్తులో హత్య

- మద్యానికి బానిసైన అన్నాతమ్ముడు
- డబ్బుల విషయంలో తరచు గొడవ
- అడిగితే ఇవ్వలేదని అన్నను చంపిన తమ్ముడు



జగన్ (ఫైల్)



విఠల్

అల్లాదుర్గం(మెదక్): మద్యానికై బానిసై అన్నదమ్ములు తరచు గొడవపడేవారు. డబ్బులు అడిగితే ఇవ్వలేదని, అప్పుడప్పుడు కొడుతుండటంతో అన్నపై కక్ష పెంచుకున్నాడు. నిద్రిస్తున్న సోదరుడి తలపై బండరాయితో కొట్టి హత్య చేసిన దారుణ సంఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్వెర గ్రామంలో శనివారం జరిగింది. సీఐ జార్జ్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిల్వెర గ్రామానికి చెందిన నాయకని జగన్ (30), విఠల్, రాజు అన్నదమ్ములు. జగన్, విఠల్ చిల్వెరలో ఒకే ఇంట్లో ఉంటున్నారు. రాజు మాత్రం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కాగా జగన్‌కు భార్య జ్యోతి, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మద్యం తాగి తరచు భార్యను కొడుతుండటంతో ఆమె పిల్లలతో కలిసి ఏడాది క్రితం ఖాదీరాబాద్‌లోని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో జగన్, విఠల్ పూర్తిగా మద్యానికి బానిసయ్యారు. మద్యం తాగి రోజూ గొడవ పడేవారని స్థానికులు తెలిపారు. శుక్రవారం రాత్రి ఇద్దరు కలిసి మద్యం తాగి గొడవ పడ్డారు. విఠల్ చెంపపై జగన్ కొట్టాడు. ఈ క్రమంలో జగన్ నిద్రిస్తున్న సమయంలో బండరాయితో తలపై కొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం లేచి రక్తపు మరకలున్న రాయిని నీటితో కడిగి, అన్నను చంపేశానని నవ్వుతూ గ్రామస్తులకు విఠల్ చెప్పాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ జార్జ్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విఠల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతున్న గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. పటాన్‌చెరు ఏఎస్‌ఐ మల్లయ్య తెలిపిన వివరాలు ప్రకారం... పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి పడి ఉండటంతో స్థానికులు చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న 35 నుంచి 40 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ముగ్గురి అదృశ్యం

**భర్త ఇంట్లో లేని సమయంలో...**



అంకిత (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): ఉత్తరప్రదేశ్‌కు చెందిన అరవింద్‌కుమార్ తన భార్య అంకితతో కలిసి గుమ్మడిదల మండలంలోని బొంతపల్లిలో నివాసం ఉంటున్నారు. స్థానికంగా ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ నెల 16 నుంచి అంకిత అనారోగ్యంతో తీవ్రంగా బాధపడుతోంది. భర్త లేని సమయంలో అంకిత ఇంటినుంచి వెళ్లిపోయింది.దీంతో అరవింద్‌కుమార్ శనివారం ఫిర్యాదు చేయగా,దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ విజయకృష్ణ తెలిపారు.

**పనిఉందని బయటకు వెళ్లి...**

మండలపరిధిలోని మిట్టపల్లికి చెందిన కేశవుల సంతోష్ వృత్తిరీత్యా డ్రైవర్. ఈ నెల 13వ తేదీన ఉదయం పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. శనివారం సిద్దిపేట త్రీటౌన్ పోలీసులకు సంతోష్ భార్య సంతోషి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్నారు.

**పనిచేసిన చోట డబ్బు తీసుకురావడానికి వెళ్లి..**



మంతీదేవి(ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): మధ్యప్రదేశ్‌కు చెందిన జయనారాయణ– మంతిదేవి బొంతపల్లిలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నారు. ఈనెల 18న పరిశ్రమలో చేసిన పనికి డబ్బులు తేవడానికి మంతిదేవి ఇంటి నుంచి బయలుదేరింది. అప్పటి నుంచి ఇంటికి రాలేదు. శనివారం ఆమె భర్త ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ విజయకృష్ణ తెలిపారు.

### పారిపోయే యత్నం.. పట్టుకున్న పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): చుంచనకోట గుట్టల గంజాయి కేసులో ఇద్దరు అరెస్టయిన విషయం తెలిసిందే. శనివారం తెల్లవారుజామున ప్రవీణ్ మూత్ర విసర్జన కోసం బయటకు వచ్చి గోడ దూకి పారిపోయాడు.వెంటనే అప్రమత్తమైన పోలీసులు ప్రవీణ్‌కోసం గాలింపు చేపట్టి గజ్వేల్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై సీఐ సత్యనారాయణరెడ్డిని వివరణ కోరగా పారిపోయిన ప్రవీణ్‌ను పట్టుకున్నామన్నారు. అరవింద్‌రెడ్డి, ప్రవీణ్‌లను రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

# వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

**కడుపు నొప్పి భరించలేక ఓ మహిళ, తాను ప్రేమించిన అమ్మాయికి ఎంగేజ్‌మెంట్ జరిగిందని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.**

**ప్రేమించిన అమ్మాయికి ఎంగేజ్‌మెంట్ జరిగిందని..**

హత్నూర(సంగారెడ్డి): ప్రేమించిన అమ్మాయికి వేరే అబ్బాయితో ఎంగేజ్‌మెంట్ కావడంతో మనస్తాపానికి లోనై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గుండ్లమాచునూర్‌లోని అరబిందో పరిశ్రమలో పశ్చిమబెంగాల్‌కు చెందిన ముఖేష్(21) కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పరిశ్రమ సమీపంలో రేకుల ఇంట్లో అదే రాష్ట్రానికి చెందిన నలుగురితో కలిసి ఉంటున్నాడు. ముఖేష్ తన స్వగ్రామంలో ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఈ క్రమంలో ఆ అమ్మాయికి కుటుంబపెద్దలు ఎంగేజ్‌మెంట్ చేశారని ఫోన్ ద్వారా తెలుసుకున్న ముఖేష్ తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. పరిశ్రమ ఎదురుగా ఉన్న ఫైర్‌స్టేషన్ వెనుకలో చెట్టుకు ఉరేసుకుని శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం గమనించిన తోటి కార్మికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

**కడుపు నొప్పి భరించలేక...**

కోహెడరూరల్(హుస్నాబాద్): కడుపు నొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకుంది. సంఘటన మండలంలోని గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని రామచంద్రపూర్ గ్రామానికి చెందిన కక్కెర్ల సమతజ్యోతి(41)ఈ నెల 18న కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందింది. మృతురాలి భర్త పరుశరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్ టెర్రర్...

### తాత అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా...

**ఒకరు మృతి..మరొకరికి గాయాలు**



ప్రశాంత్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: తాత అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలైన సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వేణుగోపాల్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కమ్మరికత్త గ్రామానికి చెందిన ప్రశాంత్(27) భార్య సౌజన్య, పిల్లలు అక్షర, ఆద్యతో కలసి హైదరాబాద్ మదీనగూడలో ఉంటున్నాడు. టైల్స్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తాత అనుమయ్య మృతిచెందాడు. అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వరుసకు సోదరుడు బొల్లారంలో ఉండే అనిల్‌తో కలసి బైక్‌పై స్వగ్రామంకు వెళ్లారు. తిరిగి బైక్ వస్తుండగా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ యూటర్న్ వద్ద పాడైన డీసీఎం వాహనాన్ని మరో డీసీఎం తీసుకెళ్తూ వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న అనిల్, ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రశాంత్ మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### గుర్తుతెలియని వాహనం ఢీ కొని..



శ్రీనివాస్ (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలపరిధిలోని వావిలాల గ్రామానికి చెందిన నాయికోటి శ్రీనివాస్(44) గురువారం రాత్రి గడ్డపోతారం గ్రామానికి వెళ్లి వస్తానని చెప్పి బైక్‌పై బయలుదేరాడు. . గడ్డపోతారం ప్రధాన రహదారిపై రాత్రి పది గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం శ్రీనివాస్ బైక్ ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించటంలో అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ విజయరావు తెలిపారు.

### రెండు బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన శంకర్

కొల్చారం(నర్సాపూర్): ఎదురుగా వస్తున్న రెండు బైకులు అతివేగంగా ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కొల్చారం పోలీసుల కథనం ప్రకారం..అందోల్ మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన ముప్పారం శంకర్ భార్య డెలివరీ అయ్యాక తుక్కాపూర్‌లో ఉంది. ఆమెకు చూసి తన బైక్‌పై తిరుగుపయనమయ్యాడు. ఇదే సమయంలో పాపన్నపేట మండలం అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన పడమటి గోపాల్ తన మరదలు, తమ్ముడి కూతురుతో కలిసి బైక్‌పై వస్తున్నాడు. మండల పరిధిలోని రంగంపేట నుంచి తుక్కాపూర్‌కు వెళ్లే రహదారిపై శనివారం రాత్రి శంకర్ అతిగా వేగంగా వచ్చి గోపాల్ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో శంకర్ తలకు తీవ్ర గాయమైంది. గోపాల్‌కు గాయాలు కాగా, ఆయన మరదలి కాలు విరిగింది. తమ్ముడి కూతురు ప్రమాదం నుండి తప్పించుకుంది. గాయపడ్డ వారిని 108 వాహనంలో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### మహిళకు తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ

జోగిపేట(అందోల్): మండలపరిధిలోని రాంసానిపల్లిలో బైక్ అదుపు తప్పి మహిళ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లాదుర్గం మండలం మందపురం గ్రామ పంచాయతీ పరిధిలోని కోమటికుంట తాండాకు చెందిన మహిపాల్ జోగిపేట ఆస్పత్రిలో తన తండ్రిని పరామర్శించడానికి భార్య శాంతిబాయితో కలిసి బైక్‌పై వస్తుండగా రాంసానిపల్లి వద్ద రాంగ్‌రూట్‌లో వస్తున్న మరో బైక్‌ను తప్పించబోయి కింద పడిపోయారు. దీంతో ఆమెకు తలకు వెనక భాగంలో తీవ్రగాయం కాగా, నోరు, ముక్కులో నుంచి రక్తస్రావం అయ్యింది. అక్కడి నుంచే స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినా 45 నిమిషాల వరకు రాకపోవడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్వాత అల్లాదుర్గం ప్రాంతానికి చెందిన అంబులెన్స్ రావడంతో అందులో శాంతిబాయిని ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ స్వరూపరాణి ఆమెకు ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

# రెండుచోట్ల హార్వెస్టర్లు దగ్ధం

**వరికోత సమయంలో హార్వెస్టర్ ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. దీంతో పూర్తిగా దగ్ధమైంది. మరోచోట విద్యుత్ తీగలు తగిలి ఓ హార్వెస్టర్ కాలిపోయింది.**



కొండపాకలో తగలబడుతున్న హార్వెస్టర్



దండుపల్లిలో...

కొండపాక(గజ్వేల్): కొండపాక గ్రామ శివారు బతుకమ్మ చెర్వు సమీపంలో యాపలబాయి నర్సింహారెడ్డి పొలంలో శనివారం రాత్రి హార్వెస్టర్‌తో వరికోత ప్రారంభించారు. ఉదయం నుంచి కోతలు కోయడం, ఎండ ఎక్కువగా ఉండడంతో ఇంజిన్ దగ్గర చిన్నపాటి మంటలు వచ్చాయి. దీంతో డ్రైవరు పరుశురాములు, పక్కనే కూర్చున్న రమేష్‌లు గుడ్డ సహాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు లేసి డీజిల్ ట్యాంకు పేలింది. అందులో ఉన్న 70 లీటర్ల డీజిల్ హార్వేస్టర్‌పై పడి ఒక్కసారి మంటలు అంటుకున్నాయి. దీంతో అప్రమత్తమైన ఇద్దరు అక్కడకు నుంచి పరుగులు తీశారు. ఈ సమయంలో అక్కడే ఉన్న మరి కొందరు వ్యవసాయ బావుల వద్ద నుంచి బకెట్లు, బిందెలో నీటిని తెచ్చి మంటలు ఆర్పేశారు. అయినప్పటికీ హార్వెస్టర 90 శాతం పూర్తిగా కాలిపోయింది. తిమ్మారెడ్డిపల్లికి చెందిన భూపాల్‌రెడ్డి లీజుకు తెచ్చి హార్వెస్టర నడిపిస్తున్నాడు. ఈ విషయమై కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్‌ను వివరణ కోరగా, ప్రాథమిక సమాచారం అందిందని, ఫిర్యాదు రాలేదని చెప్పారు.

**దండుపల్లిలో...**

మనోహరాబాద్(తూప్రాన్): వరి కోత సమయంలో విద్యుత్ తీగలు తగిలి ఓ హార్వెస్టర్ దగ్ధమైంది. మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన వెంకట్‌రెడ్డి వరికోతల కోసం హార్వెస్టర్ లీజుకు తీసుకున్నాడు. శనివారం దండుపల్లి గ్రామానికి చెందిన మరాఠి నరేందర్ పొలంలో వరికోత కోయిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి ఒక్కసారిగా హార్వెస్టర్‌లో మంటలు చేలరేగాయి. ఇది గమనించి డ్రైవర్ నర్సింలు వెంటనే కిందకు దూకి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. రైతులు నీళ్లు పోసి మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా, అప్పటికే హార్వెస్టర్ పూర్తిగా తగలబడిపోయింది.